

చరిత్ర కందని చిత్రకథ

# హేతువాదానికి లొంగని దయ్యం

"రండి. కూర్చోండి. అక్కడే నిలబడి పోయారేం?" అన్నాను. ఆ వచ్చింది ఆకాశవాణిలో నాతో పని చేసిన ఒకతను. చాలా స్నేహపాత్రుడు. కాని, ఆ అసుర సంధ్య దాటిన వేళ మెట్లు దాటి ఇవతలకు రావటం లేదు.

"రండి. కూర్చోండి."

"అవసరం లేదు కానీండి—మీతో చెప్పి పోదామని వచ్చాను. సెలవిస్తారా?" అన్నాడు నా వెనక ఉన్న సరస్వతి కేసి భయంగా చూస్తూ.

"ముందు కూర్చోండి. తరవాత మాట్లాడదాం. ఇంతకూ కేసు ఏమయింది?" అన్నాను.

ఆయన అదో మాదిరిగా చూసి గబగబా మెట్లు దిగి పోయాడు. నేను త్వరగా మెట్ల దగ్గరికి వెళ్ళాను. ఆయన రోడ్డు మీద ఎక్కడా కనపడలేదు. చాలా ఆశ్చర్యపోయాను. అతనికీ, భార్యకూ పడదు. విడాకులు తీసుకున్నాడు. మనోవర్తి తాలూకు చాలా డబ్బుభార్యకు ఇవ్వవలసి వచ్చింది. అంతవరకు నాకు అతని జీవితం తెలుసు. డ్యూటీలో చాలా కరెక్టు అతను. జీవితం అంటే నిరాశ. అనేక తడవలు అతనికి జీవితం అంటే లెక్చరు దంచి నవ్విస్తూ ఉండేదాన్ని. ఈ సంఘటన అయిన తరవాత రోజు మా రేడియో జనం పరుగెత్తుకువచ్చి, "ఏమండోయ్! మీ సు. . .గారు నాలుగు రోజుల కిందట హైదరాబాద్‌లో ఫలానా హోటల్లో ఆత్మహత్య చేసుకున్నారట" అన్నారు.

అంటే...అంటే...నిన్న సాయంత్రం నాకు కనిపించిన సు...గారి—అయ్య బాబోయ్! ఆత్మ అన్న మాట. నే నెప్పుడూ దెయ్యాలు ఉన్నాయని వినటమే తప్ప ప్రత్యక్షంగా చూడలేదు. అయితే, మేడ మెట్లు దాటి ఎందుకు రాలేదు? వంశీకుంజానికి చుట్టూ సుదర్శన చక్రం ఉంది. స్పిరిట్స్ రావు. ఇదేనా కారణం? అసలదేనా కారణం? ఈ విషయం ఎంత విచిత్రం! నిజమే. ఆయన ఆత్మహత్య చేసుకుంటాడనే అనుమానం లేకపోవటం వల్ల పరీక్ష చేయలేదు కాని, మెట్ల మీద వ్యక్తి మెట్ల మీదే మాయమయినాడు. అయితే నా దగ్గర సెలవు తీసుకోవలసిన అవసరం ఏమిటి? ఇది కారణం అయి ఉండవచ్చు. అనేక తడవలు ఆయన ఆత్మహత్య చేసుకుంటాననడం, ఆత్మహత్య మహా పాతకం అని నేను చెప్పటమే కాక మీరు ఆత్మహత్య చేసుకునేటంత బాధ కలిగినప్పుడు నా దగ్గరికి వచ్చి చెప్పండి అనివాగ్దానంతీసుకున్నాను. ఆయనఆత్మ ఆ వాగ్దానం నెరవేర్చుకోవటానికే వచ్చిందన్నమాట. ఆత్మ బరువు రెండు ఔన్సులు. హోటలు గదిలో శరీరం వాసన ప్రారంభం కాగానే పోస్టుమార్టమ్ చేశారు. పోస్టుమార్టమ్ మధ్యాహ్నం మూడు గంటలకు అయింది. సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో నే నిచ్చిన అనేకానేక ఉపన్యాసాల ఫలితంగా నా దగ్గర సెలవు తీసుకోవటానికి వచ్చిందన్న మాట. కాని దేవీ విగ్రహం, సుదర్శన చక్రం అతని ఆత్మను మెట్లు దాటి రానివ్వలేదు. రెండు వందల ఇరవై రెండు మైళ్ళు విమాన వేగంతో ప్రయాణించిన ఆత్మ శక్తి అద్భుతం. నిద్ర మాత్రలు మింగి మారు పేరుతో హోటలు గదిలో దిగి ఆత్మహత్య చేసుకున్న అనంతరం జీవితపు విలువ తెలుసుకుని, సు...గారు నాకు సంజాయిషీ ఇవ్వటానికే వచ్చి ఉండవచ్చు. కాని, ఎందుకో సెలవు మాత్రం తీసుకున్నాడు. ఆత్మలు ఉన్నాయి అవి నాకు రుజువు చేయటానికి వచ్చాడు. ఒక తడవ మా మధ్య జీవితానంతరం ఏమీ లేదు అనే చర్చ వచ్చింది.

"సరే. నేను మీకు రుజువు చేస్తాను ఆత్మ అంటూ ఉంటే" అన్నారు సు...గారు. బహుశా ఆ మాట రుజువు చేయటానికి వచ్చి ఉండవచ్చు.

ఏదయినా తులసీదాసుకు బ్రహ్మరాక్షసి కనిపించినట్లయింది నాకు. తులసీదాసు ప్రతి రోజూ ఒక రావిచెట్టు మొదట్లో సంధ్యావందనం చేసిన నీళ్ళు పోస్తూ ఉండేవాడట. ఆరు నెలల అనంతరం చెట్టు మీద నుండి ఒక బ్రహ్మ రాక్షసి ఫెళ ఫెళార్భటులతో క్రిందికి దిగి వందనం చేసిందట. తులసీదాసు "రామదర్శనం కోరుకున్న నాకు నీ దర్శనం ఏమిటి?" అన్నాడట.

"స్వామీ! మీరు పోసిన సంధ్యావందన జలంతో నా పాపం పోయింది. మీకు శ్రీరామ దర్శనం చేయించలేనుకాని, పావని ఆనవాలు చెబుతాను. రోజూ మీరు రామచరితం పఠిస్తూంటే స్తంభాన్నానుకుని వినే వృద్ధ బ్రహ్మచారి శ్రీ ఆంజనేయ స్వామి. ఆయన్ను మీరు ప్రార్థించండి" అని ఆ బ్రహ్మరాక్షసి మాయమయిందట.

అనంతరం కథ అనవసరం అనుకోండి. సు...గారి ఆత్మహత్య ఎరుగను. కాని, ఆయన దయ్యం కనుపించింది. ఆ రోజు అమావాస్య. సన్నని జల్లు, ఈదర గాలి. కాని, సు...గారు తడవ లేదు. ఇవన్నీ ఆయన చనిపోయినాడన్న తరవాత ఆలోచించాను నేను. అది వరకు ఆయనే వచ్చాడని భావించాను. ఈ మధ్య దయ్యం ఫోటోలు చూశాను. ఈ దయ్యాన్ని గురించి మన కన్నా భయపడతారు ఇతర దేశాల్లో. వాళ్ళకు ప్రత్యేకం పత్రికలే ఉన్నాయి. దయ్యాల మీద ఒక పరిశోధకుడు తీసిన దయ్యం ఫోటో కొద్దిగా తేజోరూపంలో ఉన్నది. మన దేశంలో దయ్యాన్ని 'గాలి' అంటారు. ప్రతిద సైన్సుకు ముడి పెట్టుకుంటున్న ఈ కాలంలో అతీత శక్తులు అనేకం ఉన్నాయని హేతువాదినైన నాకు సు... గారి ఆత్మ రుజువు చేసింది. నేనిలాగని చెపితే నా సహోద్యోగులు భయంతో గడ్డ కట్టుకు పోయారు. మెట్లమీద సు...గారు ఉన్నట్లే వాళ్ళు ఫీలయినారు. ఈ కథ నిజం. హోటలు పేరూ, ఆ వ్యక్తి పేరూ దాచాను. ప్రతి రేడియో వ్యక్తికీ ఆయన ఆత్మహత్య సంగతి తెలుసు. ఆయన ఆత్మ అనంతాకాశంలో లీనమయి పోయిందేమో—మళ్ళీ కనుపించలేదు.

**- డాక్టర్ లత**